25న నమ్మ కరావళి ఉత్సవం

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నమ్మ కరావళి ఉత్సవం ఈనెల 25న నిర్వహిస్తున్నట్టు కరావళి సమాఖ్య బెంగళూరు విభాగ అధ్యక్షుడు సుబ్బరాయ భట్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జేపీ నగర్‌లోని ఆర్‌బీఐ లేఅవుట్ బీబీఎంపీ గ్రౌండ్స్‌లో కరావళి ఉత్సవం జరుగుతుందన్నారు. లక్షమంది పాల్గొంటారని అంచనా వేస్తున్నామన్నారు. తీరప్రాంత సాంస్కృతిక కార్యక్రమాలు, హాస్యసందడి ఉంటుందని తెలిపారు. కాసరగూడు నుంచి కారవార దాకా తీరప్రాంతంలో కొనసాగే సంప్రదాయాల వేదికలా కొనసాగుతుందని కార్యదర్శి చరణ్ బైందూరు వివరించారు.

లోక్‌సభకు పోటీపై మంత్రుల

గగ్గోలు!





- 10 మంది పేర్ల ప్రతిపాదన
- జాతీయ స్థాయిలో బలనిరూపణకు సీఎం, డీసీఎం కసరత్తు
- సీఎం, డీసీఎం ఉత్తమ అభ్యర్థులు: మంత్రి మహదేవప్ప

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంచి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటుకునేందుకు సిద్ధమవుతోంది. గడిచిన నాలుగు నెలలుగా అభ్యర్థుల ఎంపిక విషయమై రాష్ట్ర పార్టీ నేతలు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఐదారుసార్లు సర్వేలు జరిపించారు. 28 నియోజకవర్గాల్లో దాదాపు పది స్థానాల్లో మంత్రులు పోటీ చేస్తే గెలుపు సునాయాసమనే సంకేతాలు ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీ కోసం ఎటువంటి త్యాగాలకైనా సిద్ధం కావాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ తరచూ వ్యాఖ్యానిస్తూ వచ్చారు. కొందరు ప్రారంభంలో సై అని సంకేతాలు ఇచ్చినా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సాహసం చేసేందుకు ముందుకు రావడం లేదు. రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాలు ఉండగా ప్రస్తుతం 25 స్థానాల్లో బీజేపీ, ఒక స్థానంలో కాంగ్రెస్, మరొక స్థానంలో జేడీఎస్, మండ్య నుంచి స్వతంత్ర ఎంపీగా సుమలత ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించడం ద్వారా కర్ణాటక బలం జాతీయస్థాయిలో నిరూపించుకోవాలని డీసీఎం భావిస్తున్నారు. గతంలో అధిష్ఠానం మంత్రులకు టిక్కెట్లు వద్దని సంకేతాలు ఇచ్చింది. దీంతో ఊపిరి పీల్చుకున్న మంత్రులకు మరోసారి సర్వేలు చుట్టుముట్టాయి. తాజాగా కనీసం 10 మంది మంత్రులకు టిక్కెట్లు ఇస్తే ఎక్కువ స్థానాలు సాధ్యమనే సంకేతాలు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో 10 మంది పేర్లను తాజాగా అధిష్ఠానానికి సూచించినట్టు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికల్లో గెలిచి సీనియారిటీతోపాటు సామాజిక కోణాలలో మంత్రులుగా బాధ్యతలు చేపట్టి 8 నెలలు కాగానే మరోసారి ఎన్నికలకు వెళ్లేందుకు మంత్రులు వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. వద్దు బాబోయ్ లోక్‌సభ టిక్కెట్లు అంటూ నిరాకరిస్తున్నట్టు సమాచారం. రెండు రోజులుగా పలువురు మంత్రులు లోక్‌సభ అభ్యర్థులవుతారనే ప్రచారం ఒక్కసారిగా రాజుకుంది. సిద్దరామయ్య, డీకే శివకుమార్ మధ్య నువ్వా నేనా..? అనే పోటీ సాగుతోంది. ప్రస్తుతం లోక్‌సభకు ప్రతిపాదిస్తున్న మంత్రుల్లో ఎక్కువమంది సిద్దరామయ్యకు ఆప్తులు ఉన్నారు. ఈ పరిణామాలపైనా సిద్దరామయ్య వర్గం కూడా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.

సీఎం, డీసీఎం సమర్థులు : మంత్రి మహదేవప్ప

మైసూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప చామరాజనగర రిజర్వు స్థానం నుంచి పోటీ చేయాలనే ప్రతిపాదనపై ఒకింత తీవ్రంగానే స్పందించారు. లోక్‌సభ ఎన్నికలకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమర్థులైన అభ్యర్థులని, వారు పోటీ చేస్తే బాగుంటుందని పేర్కొన్నారు. సీఎం సమక్షంలోనే తాను లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసేది లేదని, పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేశానని, మంత్రిగా మాత్రమే కొనసాగుతానని తేల్చి చెప్పారు. ఈ అంశం కాస్త అగ్రనేతల దృష్టికెళ్లింది. మండ్యలో సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ మహదేవప్ప పోటీ చేయలేనంటే ఆయన సూచించిన అభ్యర్థినే బరిలోకి దింపుతామని దాటవేశారు.

పోటీపై అధిష్ఠానానిదే తుది నిర్ణయం

కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ సోదరుడు, బెంగళూరు రూరల్ ఎంపీ డీకే సురేశ్ ఆదివారం స్పందించారు. మంత్రి మహదేవప్ప మంచి సలహా ఇచ్చారని, సాదరంగా స్వాగతిస్తానన్నారు. ఎవరిని పోటీ చేయించాలనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందని, ఎవరైనా అంగీకరించాల్సిందేనని తెలిపారు. కోలారు నుంచి మంత్రి మునియప్ప పేరు ప్రధానంగా వినిపిస్తోంది. మంత్రులు సతీశ్ జార్కిహొళి, లక్ష్మీ హెబ్బాళ్కర్, శివానంద పాటిల్ వారసులకు టిక్కెట్లు ఇప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. కానీ పార్టీ అనుభవం ఉన్నవారినే అభ్యర్థులను చేసే ఆలోచనలో ఉంది. మంత్రులు రాజణ్ణ, ఈశ్వర్ ఖండ్రె, దినేశ్ గుండూరావుతోపాటు పలువురు లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి వెనుకడుగు వేస్తున్నారు. పోటీ చేయడానికి ఇష్టంలేదని తమ సన్నిహితుల వద్ద చెబుతున్నట్టు తెలుస్తోంది.

లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 20 స్థానాలు గెలుస్తాం : సీఎం ధీమా

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కనీసం 20 స్థానాల్లో విజయం సాధించనుందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మళవళ్లికి వెళ్లేముందు మండ్యలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ అబద్ధాలను ప్రచారం చేస్తోందని, వాటిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. శాసనసభ ఎన్నికల తరహాలోనే లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదిస్తారని పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థుల పేర్లు ఖరారు కాలేదని, ప్రాబల్యం ఉన్న వారికే టిక్కెట్లు ఇస్తామన్నారు. మహదేవప్ప తాజాగా చేసిన వ్యాఖ్యలపై సీఎం స్పందించారు. మహదేవప్ప కాదంటే ఆయన సూచించినవారికే టిక్కెట్ ఇస్తామన్నారు. మైసూరు నుంచి నటుడు డాలీ ధనంజయ్ పోటీ చేసే విషయం తెలియదంటూ దాటవేశారు. పార్టీలో అటువంటి చర్చ జరగలేదన్నారు. రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలంగా ఉండేలా రూపొందించామన్నారు.

బీజేపీకి గుణపాఠం

చెప్పండి

- హామీలు అమలు చేస్తాం
- గ్యారెంటీలతో ఎంతో మందికి లబ్ధి
- బీజేపీ, జేడీఎస్ అవకాశవాద పొత్తు
- నరేంద్రస్వామిని మంత్రి చేస్తాం
- మళవళ్లి సభలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పన్నుల రూపంలో అందాల్సిన వాటా కోసం ఆందోళన చేస్తే అవమానం జరిగిందని బీజేపీ నాయకులు ఆరోపించారని, వారి ద్రోహానికి గుణపాఠంగా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండ్య జిల్లా మళవళ్లిలో వివిధ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభాలతోపాటు గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ హామీలను నమ్మకుండా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. అందుకే రూ.470కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రకటించారు. ఐదు గ్యారెంటీలను అమలు చేశామని, హామీలను విస్మరించేవాళ్లం కాదన్నారు. బీజేపీ-జేడీఎస్ అవకాశ రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. గతంలో మాజీ ప్రధాని దేవెగౌడ వచ్చే జన్మలో ముస్లింగా పుడతానని ప్రకటించారని, కానీ ఎన్నికల కోసం బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని అన్నారు. మీ సెక్యులర్ విధానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జేడీఎస్‌లో సెక్యులర్ పదాన్ని కొనసాగించే నైతికత లేదన్నారు. బీజేపీ అబద్ధాలు వల్లించడంలో నేర్పరి అని, 28 స్థానాలు గెలుస్తామని బీరాలు పలుకుతోందన్నారు. తాము 20 స్థానాల్లో గెలుస్తామనే విశ్వాసం ఉందన్నారు. శక్తి గ్యారెంటీ ద్వారా గత ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు 155 కోట్ల మంది ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. రోజూ సుమారు 60లక్షల మంది దీనిని సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. కేంద్రం అన్నభాగ్య బియ్యం ఇచ్చేందుకు రాజకీయం చేసిందన్నారు. ఇదే సందర్భంలో మళవళ్లి ఎమ్మెల్యే నరేంద్రస్వామిని మంత్రిని చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు తగిన అవకాశం భవిష్యత్తులో వస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రులు చలువరాయస్వామి, సతీశ్ జార్కిహొళి, బైరతి సురేశ్ తదితరులు పాల్గొన్నారు. సీఎంకు గజమాలలతోపాటు వేరుశనగ హారాలు సమర్పించారు.

ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు సత్కారం



రాష్ట్ర వ్యాప్తంగా బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌లు

- నిమ్హాన్స్‌పై తగ్గనున్న ఒత్తిడి
- పక్షవాతానికి గోల్డెన్ అవర్‌లో చికిత్స లక్ష్యం
- ఇప్పటికే కోలారు, చిక్కబళ్లాపుర, బెంగళూరు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మైగ్రెయిన్, తలనొప్పితోపాటు మెదడుకు సంబంధించి సమస్యలు పెరిగిపోతున్న పరిస్థితుల్లో సకాలంలో చికిత్సలు అందించేందుకు బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే కోలారు, చిక్కబళ్లాపుర, బెంగళూరు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన విధానం విజయవంతం కావడంతో ప్రతి జిల్లా ఆసుపత్రిలోనూ వీటిని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. నిమ్హాన్స్ సహకారంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఈ పథకాన్ని అమలు చేయనుంది. బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌ల ప్రారంభం ద్వారా నిమ్హాన్స్‌పై ఒత్తిడి తగ్గనుంది. రోగులు స్థానికంగానే ఉత్తమ చికిత్స పొందే వెసులుబాటు ఉంటుంది. ఈ పథకానికి రూ.25 కోట్లు ఖర్చుకానుందని అంచనా వేశారు. ప్రస్తుతం ఈ ఏడాది రూ.10 కోట్లు ఖర్చు చేయడానికి కార్యాచరణ చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎంబీబీఎస్ డాక్టర్లు ఉంటారు. వారికి మానసిక చికిత్సలు చేసే నైపుణ్యత ఉండదు. మానసిక రోగులకు చికిత్స ఇచ్చేందుకు ప్రత్యేక విభాగం ఉండాలి. మూడు జిల్లాల పరిధిలో నిమ్హాన్స్ వైద్యనిపుణులు సుమారు వందమందికిపైగా శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం మూడు జిల్లాల్లోనూ మానసికమైన సమస్యలు, మైగ్రెయిన్ వంటి సమస్యలకు స్థానికంగానే నైపుణ్యత కల్గిన వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. అంతకుమించి నరాలకు సంబంధించిన చికిత్సలు అవసరమైతే నిమ్హాన్స్‌కు సిఫారసు చేయనున్నారు. నరాల సమస్యలకు 30-40 శాతం స్థానికంగానే చికిత్సలు అందించవచ్చు. అవసరమైతే టెలి-కాన్ఫరెన్స్ ద్వారా నిపుణులను సంప్రదించి వారి సలహా సూచనలకు అనుగుణంగా అత్యవసర చికిత్సలు అందించే విధానం అమలు చేయదలిచారు. మూడు జిల్లాల్లోని ప్రతి క్లినిక్‌లోనూ నరాలు, మానసిక ఆరోగ్య నిపుణులు ఉంటారు. వీరు టెలి కాన్ఫరెన్స్ ద్వారా కూడా సలహాలు ఇస్తారు. మూడు జిల్లాల పరిధిలో వేలాదిమంది నరాలకు సంబంధించిన సమస్యలను ప్రాథమికంగా స్థానికంగానే వైద్యం పొందిన మేరకు ఇదే విధానం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తే లక్షలాదిమందికి ఉపశమనం లభించనుందని వైద్య ఆరోగ్యశాఖ భావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభించేందుకు ముందే జిల్లాలవారిగా వైద్యులకు శిక్షణలు ఇవ్వడానికి కసరత్తు చేస్తున్నారు.



నిమ్హాన్స్‌లోని న్యూరోబయోలజీ రీసెర్చ్ సెంటర్

క్లినిక్‌ల ప్రత్యేకత

బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌లలో పక్షవాతం, బుద్ధిమాంద్యం, అపస్మారకం, తలనొప్పి, నరాల సమస్య, వ్యసనాలతో మానసిక సమస్యలకు చికిత్సలు అందిస్తారు. వైద్యులు అందుబాటులో ఉండే విధానాలతో చికిత్సలు కొనసాగిస్తారు. అవసరమైనప్పుడు ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ, పునరావాసం వంటి సౌలభ్యాలు కల్పిస్తారు.

పక్షవాతం నియంత్రణలో కీలకం

బ్రెయిన్‌హెల్త్ క్లినిక్‌లలో పక్షవాతం (స్ట్రోక్) బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్సలు అందించేందుకు వీలుంటుంది. తద్వారా రోగి మరణం లేదా అంగవైకల్యం నుంచి బయటపడే అవకాశం ఉంది. 40 శాతం రోగులను బంధుమిత్రులు సకాలంలో ఆసుపత్రులకు గోల్డెన్ అవర్‌లో చేర్పించినా అక్కడ సరైన సౌలభ్యాలు లేకపోవడం, వీటిపై సమగ్రమైన అవగాహన లేకపోవడంతో ఎక్కువమంది పక్షవాతం ద్వారా అంగవైకల్యం పొందుతున్నారు. బ్రెయిన్‌హెల్త్ క్లినిక్‌ల ద్వారా పక్షవాతం నుంచి పెను సమస్యను అరికట్టవచ్చునని భావిస్తున్నారు. ప్రతి జిల్లాలోనూ బ్రెయిన్‌హెల్త్ క్లినిక్‌లు ఫిబ్రవరి ఆఖరునాటికే ప్రారంభించే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది.

నిమ్హాన్స్‌పై తగ్గనున్న ఒత్తిడి

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్స్ (నిమ్హాన్స్) దేశంలోనే నరాలకు సంబంధించి పరిశోధన, చికిత్సలు అందించే ప్రముఖ సంస్థ. ఇక్కడికి దేశవ్యాప్తంగా నరాలకు సంబంధించిన సమస్యలు ఎదుర్కొనే వారు వస్తుంటారు. నిత్యం వేలాదిమంది ఓపీడీ సేవలు పొందుతారు. వందలాదిమంది వైద్యులు ఉన్నా నిత్యం ఓపీడీ ద్వారా వచ్చే బాధితులకు సమగ్రమైన పరిశీలన, చికిత్సలు కొనసాగిస్తారు. అవసరమైనవారికి ఇన్‌పేషంట్‌గా చేర్చుకుని చికిత్సలు అందిస్తారు. ఇక్కడ వ్యాధి నిర్ధారించాక వారికి సమగ్రమైన వైద్యం అందుతుంది. ఈ విధానం దశాబ్దాలకాలంగా కొసాగుతోంది. రాష్ట్రం నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రతిరోజూ ఆసుపత్రికి వస్తుంటారు. జిల్లా కేంద్రాల్లో బ్రెయిన్‌హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నిమ్హాన్స్‌పై ఒత్తిడి తగ్గుతుందని వైద్య ఆరోగ్యశాఖ భావిస్తోంది.

91 మంది సిద్దగంగ హాస్టల్ సిబ్బంది తొలగింపు

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తుమకూరులోని సిద్దగంగ ఇంజనీరింగ్ కళాశాలకు అనుబంధమైన హాస్టల్లో పనిచేస్తున్న 91 మందిని తొలగించారు. శనివారం రాత్రి దాకా విధులు నిర్వహించారు. ఆదివారం ఉదయం హాస్టల్లోకి వస్తుండగానే మిమ్మల్ని సస్పెండ్ చేశారని, హాస్టల్లోకి ప్రవేశించరాదని సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు. పాలకమండలి సభ్యుల తీరుపై ఉద్యోగులు ఆందోళన చేశారు. ఉన్నఫళంగా తొలగించేందుకు గల కారణాలు చూపాలని వారు డిమాండ్ చేశారు. హాస్టల్లో కిందిస్థాయి నుంచి వార్డెన్, మేనేజర్ స్థాయిదాకా పనిచేసే ఉద్యోగులందరినీ ఏకకాలంలో తొలగించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పాలకమండలితో చర్చకు ప్రయత్నించారు. విఫలం కావడంతో కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. లేబర్ కోర్టును ఆశ్రయిస్తామని కార్మికులు తెలిపారు.



విదేశీయుల మనసు దోచిన గులాబీ


- రాష్ట్ర గులాబీలకు విదేశాల్లో డిమాండ్
- భారీగా పెరుగుతున్న ఎగుమతులు
- ఉద్యానశాఖ రాయితీలతో సాగుపై రైతుల ఆసక్తి

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పండుతున్న గులాబీ పూలు విదేశీయుల మనసును దోచుకుంటున్నాయి. ఇక్కడి గులాబీలకు ఇతర దేశాల్లో విపరీతమైన డిమాండ్ నెలకొంది. ప్రేమికుల దినోత్సవంలో భాగంగా ఈ ఏడాది కోట్లాది గులాబీలు విదేశాలకు ఎగుమతి అయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం విదేశాలలో మన గులాబీలకు డిమాండ్ పెరిగింది. బెంగళూరులోని ఇంటర్నేషనల్ ఫ్లవర్ ఆక్షన్ బెంగళూరు (ఐఫ్యాబ్) తగిన ఏర్పాట్లు చేసింది. బెంగళూరు విమానాశ్రయం నుంచి గత ఏడాది 5,89,300 కిలోల గులాబీలు ఎగుమతి అయ్యాయి. వీటిలో అంతర్జాతీయ మార్గాల ద్వారా 1.08 కోట్ల గులాబీలు ఎగుమతి చేశారు. వివిధ రాష్ట్రాలనుంచి 66 లక్షల గులాబీలు ఎగుమతి అయ్యాయి. 2022తో పోలిస్తే గత ఏడాది 14శాతం పెరిగింది. 2023తో పోలిస్తే ఈ ఏడాది మరింత అధికమైంది. బెంగళూరులోని ఇంటర్నేషనల్ ఫ్లవర్ ఆక్షన్ బెంగళూరుకు నగరంతోపాటు బెంగళూరు గ్రామీణ జిల్లా, చిక్కబళ్లాపుర, రామనగర జిల్లాల నుంచి గులాబీలు వచ్చాయి. ఉద్యానవనశాఖ ద్వారా రాయితీలతో పలువురు రైతులు గ్రీన్‌హౌస్‌లు ఏర్పాటు చేసుకుని గులాబీలు పెంచుతున్నారు. ఏటా లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్నందున ఎక్కువ మంది రైతులు గులాబీల సాగుకు ఆదరణ పెరుగుతోంది. కొవిడ్ కాలంలో ధరలు తగ్గి గులాబీ రైతులు ఇబ్బందిపడ్డారు. పూల మార్కెట్ కూడా తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంది. గత రెండేళ్లుగా ఫ్లవర్ మార్కెట్ ప్రగతి దిశగా సాగుతోంది. విదేశాలకు ఎగుమతులు పెరిగాయి. వాటికి అనుగుణంగానే మనదేశం నుంచి ఎగుమతి అయ్యే గులాబీలకు వివిధ దేశాలలో డిమాండ్ ఉంది. ప్రేమికుల దినోత్సవం రోజున వివిధ దేశాలలో డిమాండ్‌నుబట్టి ఒక గులాబీ రూ.20 నుంచి రూ.60-70 దాకా ధర పలికింది. తాజ్‌మహల్ రకం గులాబీ రూ.10-20 ధర పెరిగింది. గత ఏడాది రూ.40దాకా ఉండేది. ఫ్లవర్‌మార్కెట్‌లో ఒక గులాబీ రూ.18 దాకా ధర పలికింది. 200మందికిపైగా రైతులు, కొనుగోలుదారులు లాభాలు పొందారు. బెంగళూరు నుంచి కౌలాలంపూర్, సింగపూర్, కువైట్, మనీలా, న్యూయార్క్, లెబనాన్, మాల్దీవ్స్, జోర్డాన్, దుబాయ్‌తోపాటు దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, కోల్కత్తా, ముంబై, గౌహతి, అహ్మదాబాద్, చండీఘడ్, పాట్నా, కొచ్చిలకు ఎగుమతి అయ్యాయి. 2023లో బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి 5,89,300 కిలోల గులాబీలు ఎగుమతి కాగా విదేశాలకు 1.08 కోట్ల గులాబీలు ఎగుమతి అయ్యాయి. 66 లక్షల గులాబీలు వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అయ్యాయి. 2021లో 90 లక్షల పూలు, 273 టన్నుల ఎగుమతి కాగా 2022లో 1.38 కోట్లు, 512 టన్నులు, 2023లో 1.74 కోట్ల గులాబీలు, 589 టన్నులు ఎగుమతి అయ్యాయి. ప్రధానంగా తాజ్‌మహల్ రకం, సమురాయ్, గోల్డ్‌స్ట్రైక్ ఎల్లో, హాట్‌షాట్, బోనియర్, సొరన్, జుమిలియా, రాక్‌స్టార్, డచ్ రకాల గులాబీలు ఎగుమతి అయ్యాయి.





విదేశాలకు ఎగుమతికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల గులాబీలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.80	1,610.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	165	8,762
సామర్థ్యం (టీఎంసీలు)	9.29	37.70

ప్రాణాంతకంగా కేపీసీఎల్ వ్యర్థాలు

కంప్లికి ప్రయాణం చేయాలంటే ప్రాణం గుప్పిట్లో పెట్టుకుని వెళ్లాల్సిందే!

కంప్లి, ఫిబ్రవరి 18 : కుడితిని నుంచి కంప్లికి ప్రయాణం చేయాలంటే ద్విచక్రవాహనదారులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిమ్మలాపురం వద్ద వుండే కేపీసీఎల్, బీటీపీఎస్ నుంచి విడుదలయ్యే వ్యర్థాలే (యాష్ పౌడర్) ఇందుకు కారణమని చెప్పవచ్చు. విద్యుత్ తయారీ క్రమంలో ఆ ఫ్యాక్టరీల్లో బొగ్గును మండిస్తారు. ఆ క్రమంలో వ్యర్థంగా బూడిద విడుదలవుతుంది. ఆ బూడిదను (యాష్‌ను) ట్యాంకర్ల ద్వారా బయటకు తరలించాల్సి ఉండగా, లారీల ద్వారా రవాణా చేస్తున్నారు. దానిని బయటకు తీసుకెళ్లే సమయంలో లీకేజీలతో రోడ్లపై పడిపోతోంది. దానిపైనే వాహనాలు తరచుగా తిరగడంతో ఆ దుమ్ముధూళి గాలికెగిరి వాహనదారుల కళ్లల్లో పడుతోంది. ముఖ్యంగా ద్విచక్రవాహనదారుల శరీరంపై, కళ్లపై ఈ బూడిద పేరుకుపోతోంది. ఇందువలన చర్మంపై దురదలు ఏర్పడడమే కాకుండా ప్రాణనష్టం కలిగే అవకాశం వుందని నిపుణులు మొత్తుకుంటున్నారు. ఈ విషయమై బీటీపీఎస్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని కుడితిని, తిమ్మలాపురం, దరోజీ, దేవలాపురం, కంప్లి గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కేవలం ట్యాంకర్లకే ఈ యాష్ పౌడర్‌ను రవాణాచేసేదుకు అవకాశం కల్పించాలని ఎన్నిసార్లు విన్నవించినా, అధికారుల నిర్లక్ష్యం వల్ల దానిని లారీల్లో కూడా రవాణా చేస్తున్నారు. అది ఇలా రోడ్లపై జారిపడి దుమ్ముధూళిగా ఏర్పడి ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోంది. త్వరలోనే కేసీసీఎల్, బీటీపీఎస్ అధికారులు లారీలకు బదులుగా ట్యాంకర్లలో మాత్రమే వ్యర్థాలను మళ్లించేందుకు అవకాశం కల్పించాలని లేనిపక్షంలో భారీఎత్తున ధర్నాలు, ప్రతిఘటనలు తప్పవని పర్యావరణసంస్థల వారు హెచ్చరిస్తున్నారు.



మెట్రి వద్ద లారీల నుంచి పడిపోయిన వ్యర్థ బూడిద



బూడిద పేరుకున్నరోడ్లపై ప్రయాణిస్తున్న వాహనాలు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను పంపిణీ చేసిన మేయర్ శ్వేత

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 18: విజయనగర కన్నడ రక్షణ వేదిక ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. రాజ్‌కుమార్ రోడ్డులోని కన్నడ భవనంలో ఆదివారం 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగర మేయర్ శ్వేత ప్రతిభ పురస్కారాను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందడం లేదని ప్రజలు అనుకుంటున్నారని, ప్రభుత్వ పాఠశాలలోనే ఎంతో మంది చదువుకుని మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకున్నారని తెలిపారు. ఏ పాఠశాలలోనైనా ఉన్నత విద్యను అందించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. విజయనగరం కరుణాడు రక్షణ వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణస్వామి మాట్లాడుతూ వసతులులేకపోయినా సరిహద్దు పాఠశాలల విద్యార్థులు అధికమార్కులు సాధించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఒబలేశ్, ద్వితీయస్థానంలో నిలిచిన కరిబసమ్మ, తృతీయ స్థానం సాధించిన మోహన్‌లను సత్కరించారు. ఈసందర్భంగా కల్లుకంబ లక్ష్మణ, తోలుబొమ్మలాట కళాకారుడు సుబ్బన్న, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జి ఇంటి ఆవరణలో మామిడికాయల చోరీ

బళ్లారి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ధావణగెర జిల్లా హైకోర్టు జడ్జి ఇంటి ఆవరణలో మామిడి చెట్టుకు కాసిన కాయలను ఇద్దరు యువకులు అపహరించారని జడ్జి నివాసంలో పనిచేసే కావలి ధావనగెర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధావనగెర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా జడ్జి ఇంటి ఆవరణలో మామిడి చెట్టు ఉంది. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో వచ్చి కాంపౌండు గేటు దూకి చెట్టుకు కాసిన కాయలను అపహరించుకెళ్లారు. విషయం జడ్జి ఇంటి సీసీ టీవీ ఫుటేజీ ద్వారా గుర్తించారు. జడ్జి ఇంటిలో పనిచేస్తున్న హెడ్‌డీ అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ధావనగెర 1టౌన్ పోలీసులు తెలిపారు. ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి అసలు వీరు ఎవరికీ తెలియకుండా మామిడికాయలు ఎలా కోశారనే అంశంపై పోలీసులు విచారిస్తున్నారు.

గ్రామాల్లో ధర్మజాగృతి అవసరం



ప్రమోద్ ముతాలిక్

హొసపేట, ఫిబ్రవరి 18: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలను లక్ష్యంగా పెటుకుని మత మార్పిడికి పాల్పడతారని అలాంటి వారిపట్ల జాగ్రత్త పడాలని శ్రీరామ సేన ముఖ్యుడు ప్రమోద్ ముతాలిక్ హెచ్చరించారు. విజయనగరం జిల్లా కొట్టూరు తాలూకా దూపదహళ్ళి తాండాలో శనివారం కరియమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మతమార్పిడి అన్నది క్యాన్సర్ లాంటిదని, దాన్నుంచి దూరంగా ఉండాలని సూచించారు. ధర్మగురువులు ప్రజల్లో ధర్మ జాగృతి కల్పించాలని ఆయన కోరారు. మనిషి ఏ ధర్మంలో జన్మిస్తారో చివరివరకు అదే ధర్మంలో కొనసాగటం మంచి పద్ధతి అని అన్నారు. ఈసందర్భంగా బంజారా సముదాయం మఠాధీశులు, ప్రముఖులు పాల్గొన్నారు.

వీవీ సంఘం ఎన్నికలో మహేంద్రకుమార్ నామినేషన్



నామినేషన్ వేస్తున్న మహేంద్రకుమార్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 18: ప్రతిష్టాత్మక వీరశైవ విద్యావర్ధక సంఘం కార్యవర్గ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పాత్రికేయుడు పట్టణేతర అభ్యర్థిగా మహేంద్రకుమార్ శనివారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయన మాట్లాడుతూ యువజన సమూహం పట్టణేతర అభ్యర్థిగా తాను విద్యా సంస్కరణలు , సుపరిపాలన, సిబ్బందిలో ప్రతిభను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నానన్నారు. సభ్యులందరి మద్దతు తనకు లభిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. ఈసందర్భంగా కల్లుడి మంజునాథ్, కేణి బసవరాజు, జనతాబజార్ అధ్యక్షుడు నీలకంఠప్ప. మంజునాథ్, వీరశైవ తరుణ సంఘం అధ్యక్షుడు నందీష్ మఠం, లోకనాథ్, శెట్రు శ్రీకాంత్, వీరభద్రయ్య, శంకర్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు: కలెక్టర్



డీసీ ప్రశాంత్‌కుమార్

సిరుగుప్ప, ఫిబ్రవరి 18 : తాగునీటి సమస్య ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా హెచ్చరించారు. సిరుగుప్ప పట్టణం నగరసభ కార్యాలయంలో నగరంలో నెలకొన్న వివిధ సమస్యలపై ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు జాగ్రత్తలు పాటించాలని కోరారు. తాలుకాలోని గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత నీటి సరఫరా అధికారులు తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని కోరారు. నగర ప్రజలు వార్డుల్లో నెలకొన్న సమస్యలపై జిల్లా అధికారికి వివరించారు. ఈ సందర్భంగా బీఎం నాగరాజ, నగరసభ కమిషనర్ గురుప్రసాద్, తహసీల్దార్ షంషాలం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యోగా ప్రయోగశాలగా హోస్పేట్ ఫ్రీడమ్ పార్కు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 18:హోస్పేట ప్రజల మక్కువ, కొత్త యోగాకేంద్రాలపై ఆసక్తి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా యోగాశిబిరాలు నిర్వహిస్తున్నామని పతంజలి యోగా సమితి దక్షిణ భారతదేశ ఇన్‌చార్జి భవర్‌లాల్ అన్నారు. నగరంలోని ఫ్రీడమ్ పార్కులో జననీ మల్టీ పర్సన్ కో-ఆపరేటివ్ సొసైటీ సహకారంతో పతంజలి యోగా శిబిరం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆయన ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. అగ్నిహోత్రం చేయడం చాలా ముఖ్యమైన పని అని, రానున్న రోజుల్లో సంస్కృత సంవాద శిబిరాలు మరింత ఎక్కువగా నిర్వహించాలన్నారు. ఫ్రీడం పార్కులో యోగా శిబిరం విజయవంతంగా ఏడాది పూర్తయినందున అభినందనలు తెలుపుతూ యోగాకేంద్రం ఇన్‌చార్జిలు అనంతజోషి, శ్రీరాములను ప్రత్యేకంగా సత్కరించారు.

పతంజలి యోగాశిబిరం వార్షికోత్సవం సందర్భంగా ఉదయం పతంజలి యోగాకమిటీ విజయనగరం, గదగ్ జిల్లా ఇన్‌చార్జి హంద్రాల్ ఆధ్వర్యంలో సూర్యభేదన, చంద్రభేదన ప్రాణయామాలపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. సోమరితనం తొలగించడానికి, విష్ణుముద్ర, పృథ్వీ ముద్ర వేసి, ప్రాణాయామాలు చేసే విధానాన్ని ప్రదర్శన ద్వారా వివరించారు. విఠల నామ సంకీర్తన ద్వారా గుండె సమస్యలు తొలగిపోతాయనే శాస్త్రోక్తమైన సత్యాన్ని కూడా ఆయన విఠల నామ సంకీర్తన ద్వారా చూపించారు. ఈసందర్భంగా రాష్ట్ర యూత్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, బళ్లారి ఇన్‌చార్జి రాజేశ్ కర్వా, విజయనగరం జిల్లా ఇన్‌చార్జి హల్లికేరి మార్గదర్శకత్వం వహించారు. ఈసందర్భంగా అనంతజోషి, శ్రీరామ్, చంద్రికా శ్రీరామ్, వెంకటేశ్ సహా పలువురు పాల్గొన్నారు.



ఫ్రీడం పార్కులో మాట్లాడుతున్న అనంతజోషి, శ్రీరాములు తదితరులు

తాగునీటి పైపులైన్‌ను ప్రారంభించిన మంత్రి



పైపులైన్ ప్రారంభించి పూజలు చేస్తున్న మంత్రి నాగేంద్ర

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 18 : తాలుకాలోని హరిగినదోణి, జానెకుంట, జానెకుంట తాండా గ్రామాలకు అల్లిపుర రిజర్వాయర్ నుంచి నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ పనులను మంత్రి నాగేంద్ర ప్రారంభించారు. రూ. 30 లక్షల నిధులతో అల్లిపుర రిజర్వాయర్ నుంచి తొమ్మిది కిలోమీటర్ల మేర పైపులైన్ వేయించి ఈ మూడు గ్రామాలకు నీటిని అందించేందుకు కృషి చేసిన మంత్రికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గ్రామాలలో నీటి సమస్యను ఏ అధికారి గానీ, పాలకులు గానీ తీర్చకపోవడంతో పాటు గత ఎన్నికలలో ఎన్నికలను కూడా బహిష్కరించడంతో మంత్రి నాగేంద్ర ఆ గ్రామాలను సందర్శించి వారి నీటి సమస్య తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఆ మూడు గ్రామాలకు అనుగుణమైన ప్రాంతంలో చిన్న పాటి రిజర్వాయరును నిర్మిస్తామని తెలిపారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మంత్రికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు వెంకటేష్ ప్రసాద్, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మరలింగమ్మ, గ్రామ పంచాయతీ సభ్యులు గంగాధర్, చంద్రప్ప, భోగేష్, ఓబిరెడ్డి, వెంకటారెడ్డి, బసవన గౌడ, గంగన్న, మల్లికార్జున, వన్నూరప్ప, పలు గ్రామాల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరిగుప్పలో జోడు రథోత్సవాలు

సిరుగుప్ప, ఫిబ్రవరి 18 : తాలుకాలోని ముదయనూరు, బలకుంది గ్రామాల మధ్య హగరి నదిలో వెలసిన శనేశ్వర, నిర్మానానంద స్వాముల వారి జోడు రథోత్సవాలను సోమవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు నాగేంద్రస్వామి తెలిపారు. కావున భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని స్వాముల వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వైభవంగా తిరుమల హైస్కూలు వార్షికోత్సవం

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 18 : బళ్లారి ఆర్టీఓ చెక్‌పోస్టు, వద్దనున్న తిరుమల హైస్కూలు వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఈవో నైనిస్ మునీర్, అధ్యక్షులు కానెప్ప, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు భారతి హాజరయ్యారు. కరెస్పాండెంట్ యల్లప్ప నేతృత్వంలో ఈ వార్షికోత్సవ కార్యక్రమాన్ని వారు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. చిన్నారులు, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు నృత్యాలు చేస్తూ, డ్యాన్స్‌లు వేస్తూ ఆనందంగా గడిపారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని వివిధ పాటలు పాడుతూ, నృత్యాలతో ఆనందంగా గడిపారు. అనంతరం అందరికీ భోజన వసతి కల్పించారు. ఈ హైస్కూలు ప్రారంభించి 15 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు హెచ్‌ఎం నాగరాజు, ఏఎస్‌ఐ ఉమేష్, గ్రామ పంచాయతీ సభ్యులు అంజి, మల్లికార్జున, పలు గ్రామాల పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

ప్రాచీనమైనది పోస్టల్ వ్యవస్థ



బళ్లారి సెంట్రల్ పోస్టాఫీసును సందర్శించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 18: భారతదేశంలో తపాలా వ్యవస్థ ప్రాచీన కాలం నుంచి అములులో ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిచెళ్లగుర్కి తెలిపారు. ఆయన తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి ఆదివారం బళ్లారి సెంట్రల్ పోస్టాఫీసును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత దేశంలో పోస్టల్ డిపార్టుమెంట్ 1837లో స్థాపించబడిందని తెలియజేశారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థ అని, ప్రస్తుతం దేశంలో 1,56,000 పోస్టాఫీసులు ఉన్నాయన్నారు. దేశంలో తొమ్మిది జోన్‌లు ఉన్నాయన్నారు. వాటిని గుర్తించడానికి ఆరు అంకెల పిన్ నంబర్ ఉపయోగపడుతుందన్నారు. ఇందులో ,మొదటి సంఖ్య మండలాన్ని, రెండవ సంఖ్య ఉప మండలాన్ని మూడవ సంఖ్య జిల్లాను సూచిస్తుందన్నారు. మిగిలిన సంఖ్య తాలూకాలోని పోస్టాపీసును సూచిస్తుందన్నారు.

ఘనంగా అబ్దుల్ కలామ్ పాఠశాల వార్షికోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, ఫిబ్రవరి 18 : ఇటీవల దేశం భారీగా ఆర్థికాభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే బీఎం నాగరాజు తెలిపారు. సిరుగుప్ప పట్టణం అబ్దుల్‌కలామ్ పాఠశాలలో 19వవార్షికోత్సవ వేడుకల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉద్యోగాలు పొందాలని ఆయన తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పిల్లల విద్యాభ్యాసంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు నృత్యాలను ప్రదర్శించారు.

నవ బృందావనంలో ప్రత్యేక పూజలు

కంప్లి, ఫిబ్రవరి 18 : అనెగొంది తుంగభద్ర నది తీరాన వెలసిన నవ బృందావనంలో మధ్వనవమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీ రాఘవేంద్రస్వామి మఠాధీశ్వరులు సుబేంద్రతీర్థులు ఆధ్వర్యంలో రంగనాథ స్వామి తదితరులు విశేష పూజలు చేపట్టారు. ఇందులో పద్మనాభ జయతీర్థ, కవీంద్ర, వాగేష్, వ్యాసరాజ, శ్రీనివాస, రామతీర్థ, సుదేంద్ర తీర్థ, గోవిందు వడియార్, తదితరుల బృందావనాలకు పంచామృతాభిషేకం చేసి పూలమాలలు, తులసీమాలలతో అలంకరించారు. అనంతరం భజనలు, సంకీర్తనలతో అలరించారు. ఈ పూజల్లో పలుగ్రామాలు, పట్టణాల నుంచి ప్రజలు పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో అనుమేష్ ఆచారి బృందావన సంప్రదాయంపై ప్రత్యేక ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో కారణమ్ జయతీర్థ, శ్రీనివాసమూర్తి, సత్తి కల్లూర్, స్వామిరాయ్, ఆనెగొంది వ్యవస్థాపకులు సుమంత్ కులకర్ణి, నరసింహాచారి, విజయేంద్ర ఆచారి, బళ్లారి, చిందనూరు, హోస్పేట భజన మండలి భక్తాదులు పాల్గొన్నారు.



బృందావనంలో పూజలందుకున్నపూర్వ మఠాధీశుల సమాధులు

హోసూరు జోన్

అయోధ్యకు 800 మంది భక్తుల పయనం



హోసూరు నుంచి అయోధ్యకు వెళుతున్న భక్తులు

హోసూరు ఫిబ్రవరి 18 : హోసూరునుంచి భారతీయ జనతాపార్టీ తరఫున 800 మంది భక్తులను హోసూరు రైల్వే స్టేషన్ నుంచి అయోధ్య శ్రీరామ మందిరానికి నాల్గవ దశలో పంపారు. ఇప్పటి వరకు తళి, వేపనపల్లికి చెందిన దాదాపు 3400 మంది భక్తులు అయోధ్యను సందర్శించారు. హోసూరు ప్రాంతం నుంచి 800 మంది భక్తులను పంపే నాల్గవ విడత కార్యక్రమం ఆదివారం జరిగింది. బీజేపీ జిల్లా కోశాధికారి శ్రీనివాసన్, రాష్ట్ర జాబితా టీమ్ ఉపాధ్యక్షురాలు కస్తూరి, జిల్లా కార్యవర్గ సభ్యులు మురుగన్, శ్వేత, ప్రవీణ్‌కుమార్, టీమ్ సెక్షన్ ఎగ్జిక్యూటివ్‌లు రామలింగం, బోధిరాజ్, కరుణానిధి, ఓం, మంజుళ, మురళి, కుమార్ పాల్గొన్నారు.

నగర శివార్లలో వరుస చోరీలు

హోసూరు(క్రైం) ఫిబ్రవరి 18: హోసూరు నగర శివార్లలోని బేగేపల్లిలో రాత్రిపూట దొంగల స్వైరవిహారంతో సామాన్యులు భయపడుతున్నారు. హోసూరు సమీపంలో బేగేపల్లి గ్రామం గోవింద అగ్రహారం ప్రాంతంలోని కొన్ని దుకాణాల తాళాలు పగులకొట్టి చోరీ చేస్తు వస్తున్నారు. అదేవిధంగా సరస్వతి నగర్‌లో భారతీవేలు కుటుంబసభ్యులు స్వగ్రామానికి వెళ్లగా ఇంటి తాళం పగుల గొట్టి సెల్‌ఫోన్, డబ్బులు చోరీకి పాల్పడ్డారు. అయితే సరస్వతీ నగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసరెడ్డి ఇంట్లో ఎవ్వరు లేరని తెలిసి అర్ధరాత్రి ఇంటి తాళం పగులగొట్టిన దృశ్యాలు ఇంటి తాళం పగులగొట్టిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమరాలో రికార్డు అయ్యాయి. తరచుగా చోరీకి ప్రయత్నించడంతో ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురువుతున్నారు. ఈ విషయంలో పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రూ.7లక్షల అలంకార మొక్కల చోరీ

హోసూరు(మత్తిగిరి), ఫిబ్రవరి 18: హోసూరు సమీపంలోని ఇనుపసంద్రం గ్రామానికి చెందిన గోపాల్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో డ్రాసేనా రిప్లెక్సా అనే అలంకార మొక్కను పెంచుతున్నారు. ఆయన ఆరు నెలల క్రితం ఆంధ్ర రాష్ట్రం నుంచి మొక్కకు రూ.30 ధరతో 12వేల అలంకారమైన మొక్కలను కొనుగోలు చేసి తన తోటలో పెంచారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి దాటకముందే అతడి తోటలోకి చొరబడిన దుండగులు 12 వేల అలంకార మొక్కలలో 4 వేల మొక్కలను టెంపోవ్యాన్‌లో తరలించారు. ఎప్పటిలాగే ఆదివారం తోటలోకి వెళ్లిన రైతు గోపాల్ తోటల్లో 4 వేలకు పైగా అలంకార మొక్కలు ధ్వంసం కాగా, మిగిలిన మొక్కలను చోరీకి గురైనట్టు గుర్తించి వాపోయాడు. చోరీకి సంబంధించి గోపాల్ హోసూరు హడ్కో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.. నేటి మార్కెట్ ప్రకారం డ్రాకేనా రిప్లెక్సా అర్నమెంటల్ ప్లాంట్ ఒకటి రూ.200కు విక్రయిస్తున్నారని, చోరీకి గురైన 4వేల మొక్కలు రూ.7 లక్షలకుపైగా విలువ ఉంటాయన్నారు. అలంకార మొక్కల చోరీ చేసినవారిని గుర్తించి అరెస్టు చేయాలని, తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.



చోరీకాగా మిగిలిన మొక్కలను చూపుతున్న రైతు

225 జంటలకు సామూహిక వివాహాలు



వివాహ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎస్ భోసరాజు

రాయచూరు, ఫిబ్రవరి 18: జిల్లాలోని దేవదుర్గ తాలూకా గబ్బూరులో వెలసిన శ్రీ బూదిబసవేశ్వర స్వామి మఠం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వివాహాలు అంగరంగా వైభవంగా జరిగాయి. ప్రతి ఏటా శ్రీ బూదిబసవేశ్వర స్వామి పర్యవేక్షణలో మఠం తరఫున సామూహిక వివాహాలు జరిపించడం ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 225 మంది జంటలకు సామూహిక వివాహం జరిపించగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు కొత్త జంటలను ఆశీర్వదించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించిన మంత్రి, పేద మధ్యతరగతి కుటుంబాల వారికి అండగా ఉండేలా సామూహిక వివాహాలు జరిపించడం అభినందనీయమే గాక ఆదర్శమన్నారు. ఇలాంటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తుండడంవలన మఠం సేవలు కలకాలం గుర్తుంటాయన్నారు.

వైభవంగా పంచముఖ ఆంజనేయ స్వామి రథోత్సవం



ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకొస్తున్న భక్తులు

రాయచూరు, ఫిబ్రవరి 18: తాలూకాలోని గాణదాళ గ్రామంలో వెలసిన పంచముఖ ఆంజనేయ స్వామి రథోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మధ్వనవమి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించిన అర్చకులు ఆలయ మాడావీధుల్లో స్వామి వారిని వివిధ రకాల పూలతో అలంకరించి రథోత్సవం నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఛత్రపతి శివాజీ (జయంతి)



ఛత్రపతి శివాజీగా పేరొందిన శివాజీ రాజే భోంస్లే 1630 ఫిబ్రవరి 19న పూణె జిల్లాలో జన్మించారు. మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించారు. 1674లో జ్యేష్ఠ శుద్ధ త్రయోదశిన పట్టాభిషేకం జరిగిన సందర్భాన్ని హిందూ సామ్రాజ్య దివస్‌గా ఆచరిస్తారు. యుద్ధతంత్రాలలోనే కాక పరిపాలనా విధానంలోనూ అగ్రగణ్యులుగా పేరొందారు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, గుఢచారి వ్యవస్థ వంటి వాటిని ఏర్పాటు చేశారు. ఎన్నో యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్రస్థలాలను ధ్వంసం చేయలేదు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా చూసేవారు. చక్కటి పాలనతో ప్రజల ఆదరణ పొందారు. సుమారు 300 కోటలు ఆయన అధీనంలో ఉండేవి. సాంకేతిక విలువలతో కూడిన దుర్భేద్యమైన కోటలను నిర్మించడంలో ఖ్యాతి పొందారు. 1680 ఏప్రిల్ 3న కన్నుమూశారు.

గోపాలకృష్ణ గోఖలే (వర్ధంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు గోపాలకృష్ణ గోఖలే 1866 మే 9న జన్మించారు. సమాజ సేవకుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. పాశ్చాత్య రాజకీయాలపై అవగాహన కలిగారు. 1885 నుంచి 1905 వరకు మితవాదులు ప్రాబల్యం కల్గిన కాంగ్రెస్‌లో ప్రముఖపాత్ర వహించారు. 1902 నుంచి 1915 వరకు శాసనమండలి సభ్యుడిగా ఉన్నారు. 1905లో సర్వంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ ఏర్పాటు చేశారు. భారతీయులలో జాతీయతా భావాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు. మహ్మద్ అలీ జిన్నా, మహాత్మాగాంధీలకు రాజకీయ గురువు. 1915 ఫిబ్రవరి 19న కన్నుమూశారు.

కె. విశ్వనాథ్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత కాశీనాథుని విశ్వనాథ్ 1930 ఫిబ్రవరి 19న రేపల్లెలో జన్మించారు. తెలుగు సినిమా దర్శకుడు, కళాతపస్వి బిరుదాంకితులు. ప్రశస్తమైన సినిమాలను సృష్టించి తెలుగు సినిమాకు ఒక గౌరవాన్ని, గుర్తింపును తెచ్చిన మహోన్నతమైన వ్యక్తి. శంకరాభరణం, సప్తపది, స్వాతిముత్యం, సాగరసంగమం, శృతిలయలు, సిరివెన్నెల, స్వర్ణ కమలం, స్వయంకృషి, శుభలేఖ వంటివి ఎంతో ప్రముఖమైనవి. కొన్ని సినిమాల్లోనూ నటించారు. రఘుపతి వెంకయ్య పురస్కారం, దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం ఇతర గౌరవాలు పొందారు. 2023 ఫిబ్రవరి 2న శివైక్యం చెందారు.

యోగాతో ఒత్తిడి నియంత్రణ

» మంత్రి దినేశ్ గుండూరావు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఒత్తిడిని నియంత్రించవచ్చని, వయసుతో సంబంధం లేకుండా యోగాభ్యాసం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు పిలుపునిచ్చారు. ఆయుష్ శాఖ, యోగా గంగోత్రి కర్ణాటక సంయుక్త ఆధ్వర్యంలో విధానసౌధ ప్రాంగణంలో ఆదివారం రథసప్తమి 2024 సూర్యనమస్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒత్తిడి నియంత్రణ, మానసిక సమస్యలు, రుగ్మతల నియంత్రణ, ఆరోగ్యం కోసం యోగాను పాటించాలని సూచించారు. వందలాదిమంది సూర్య నమస్కారాలలో భాగస్వాములయ్యారు. ఎమ్మెల్సీ శరవణతోపాటు ఆయుష్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.



విధానసౌధ వద్ద సూర్యనమస్కారాలు

యోగాతో చక్కటి ఆరోగ్యం

బొమ్మనహళ్ళి, ఫిబ్రవరి 18: పతంజలి యోగ శిక్షణ ఆధ్వర్యంలో రథసప్తమని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సుమారు 2వేలమంది యోగాభ్యాసకులు పాల్గొని 1008 అగ్నిహోత్ర, 108 సూర్య నమస్కారాలు చేశారు. 44 ఏళ్లుగా పతంజలి యోగా సంస్థ ఉచిత సేవల అందిస్తోందని నిర్వాహకులు తెలిపారు. జేపీనగర్ మైదానంలో ఆదివారం ఏర్పాటైన కార్యక్రమం ఎంపీ తేజస్వి సూర్య పాల్గొన్నారు. క్రమం తప్పని యోగాభ్యాసం ద్వారా చక్కటి ఆరోగ్యం సాధ్యమన్నారు. ఉదయం 6 నుంచి 8వరకు సాగిన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. పెద్దసంఖ్యలో విద్యార్థులు, స్థానికులు పాల్గొని యోగాభ్యాసంలో పాల్గొన్నారు.



ఆసనాలు వేస్తున్న యువత



జేపీ నగర్ మైదానంలో యోగాసనాలు

శిరాళకొప్ప బస్టాండులో పేలుడు

» అదుపులో దంపతులు

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శివమొగ్గ జిల్లా శిరాళకొప్ప బస్టాండ్ వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న బ్యాగ్‌లో పేలుడు సంభవించింది. దీంతో బస్టాండ్‌లోని ప్రయాణీకులు దుకాణదారులు బెంబేలెత్తారు. ఆదివారం మధ్యాహ్నం సంఘటన చోటు చేసుకుంది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకున్నారు. శివమొగ్గ జిల్లా శికారిపుర తాలూకా శిరాళకొప్ప పట్టణంలోని బస్టాండ్ వద్ద సంఘటన జరిగింది. పందులను చంపేందుకు ఉపయోగించే నాటుబాంబులు అయి ఉంటాయని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారపు సంత కావడంతో సాధారణం కంటే ప్రజల రద్దీ ఎక్కువగానే ఉంది. బెడ్‌షీట్ల వ్యాపారి ఆంటోనిదాస్ (50)తోపాటు మరో వ్యక్తి గాయపడ్డారు. హావేరి జిల్లాకు చెందిన దంపతులు ఉమేశ్, రూపాలు సదరు వ్యాపారి వద్ద బెడ్‌షీట్ కొనుగోలు చేసి తమ బ్యాగ్ అక్కడ ఉంచి మరో దుకాణానికి వెళ్లారు. ఇంతలోనే కొద్దిసేపటికే పేలుడు సంభవించింది. ఆంటోనిదాస్ కాలు, చేతికి తీవ్ర గాయాలు కావడంతో శికారిపుర ఆసుపత్రికి తరలించారు. శిరాళకొప్ప పోలీసులు సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఎస్పీ మిథున్‌కుమార్ మాట్లాడుతూ సంతలో ఆంటోని నుంచి రూ.800కు బెడ్‌షీట్ కొనుగోలు చేసిన దంపతులు చేశారని, వారి వద్ద ఉన్న బ్యాగును సదరు వ్యాపారి వద్ద ఉంచారన్నారు. కొద్దిసేపటికే పేలుడు సంభవించిందన్నారు. దంపతులు కాఫీ తోటలో పనిచేసేవారని, వన్య ప్రాణులను బెదరించేందుకు పేలుడు పదార్థాలు వాడుతారన్నారు. ఇలా కల్గిన బ్యాగులోని వస్తువులు అకస్మాత్తుగా పేలాయన్నారు. ఘటనకు సంబంధించి దంపతులను అదుపులోకి తీసుకున్నామని మరింత దర్యాప్తు జరుగుతోందన్నారు.



పేలుడు జరిగిన శిరాళకొప్ప సంత ప్రదేశం ఇదే...

ఇది మీ ప్రభుత్వం.. సమస్యలు పరిష్కరిస్తాం

» ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇది మీ ప్రభుత్వమని సమస్యలు తీరుస్తామని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. జ్ఞానభారతి ప్రాంగణంలోని బీపీఎడ్ మైదానంలో యశ్వంతపుర, రాజరాజేశ్వరినగర్ నియోజకవర్గాలకు సంబంధించి బాగిలెగె బంతు సర్కార - సేవెగె ఇరలి సహకార (ఇంటి చెంతకే ప్రభుత్వం - సేవలకు సహకారం) పేరిట ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వందలాదిమంది సమస్యలతో రాగా వారి అర్జీలను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపి రోజుల వ్యవధిలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. యశ్వంతపుర బీజేపీ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్, డీసీఎంను కొనియాడారు. ఆర్‌ఆర్ నగర్ ఎమ్మెల్యే మునిరత్న మాట్లాడుతూ ఇది ప్రభుత్వ కార్యక్రమమని పొగడ్తలు, జిందాబాద్‌లకంటే ప్రజాసమస్యలు ఆలకించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎంపీ డీకే సురేశ్ సుదీర్ఘంగా ప్రజలనుంచి వినతులు స్వీకరించారు.

సమాజసేవకు అంకితం కావాలి

» రవిశంకర్ గురూజీ పిలుపు



పురస్కార ప్రదానోత్సవంలో రవిశంకర్ గురూజీ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సమాజసేవలో ప్రతి ఒక్కరూ అంకితం కావాలని తద్వారా మరింతమందికి చేయూత ఇచ్చినట్టు అవుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థాపకులు రవిశంకర్ గురూజీ అభిప్రాయపడ్డారు. ఎస్‌ఎంఎక్స్ - సీఎస్‌ఆర్ లీడర్‌షిప్ రౌండ్‌టేబుల్ సమావేశంలో తారే జమీన్ పర్ సంస్థకు అత్యుత్తమ సీఎస్‌ఆర్ పురస్కారం అందించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో ఆదివారం కార్యక్రమం జరిగింది. సమావేశంలో రవిశంకర్ గురూజీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజాసేవ చేసేవారు పెరగాలని ఆకాంక్షించారు. సినోప్సిస్ ఇండియా సంస్థ సీనియర్ ఆర్కిటెక్చర్ బీయూ చంద్రశేఖర్, తారే జమీన్‌పర్ వ్యవస్థాపకులు దినేశ్ బాడగండి, ఫౌండర్ ముఖ్యులు అభిజిత్ చౌదరి ముఖ్యులుగా పాల్గొన్నారు. 200కుపైగా సీఎస్‌ఆర్ కంపెనీలు పాల్గొన్నాయి. దినేశ్ బాడంగడి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 23లక్షలమంది విద్యార్థులు తారే జమీన్‌పర్ సంస్థ మొబైల్ ప్లానెటోరియం ద్వారా అవగాహన పొందారన్నారు. విద్యార్థులలో శాస్త్రీయభావాలు పెంపొందించాలన్నది మా ఆశయమన్నారు. అభిజిత్ చౌదరి మాట్లాడుతూ మొబైల్ ప్లానెటోరియం ప్రదర్శనతోపాటు శాస్త్రవేత్తలతో చర్చాగోష్టులు, విజ్ఞానమేళా, కౌన్ బనేగా సోపతి వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

రాఘవేంద్ర బ్యాంకులో..
రూ.1544 కోట్ల రుణాలకు రికార్డుల గల్లంతు

» ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులో వెల్లడి

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గురు రాఘవేంద్ర సహకార బ్యాంకు అవినీతిని విచారిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలనమైన అంశాలను వెలుగులోకి తెచ్చింది. బ్యాంకులో రూ.1544.43 కోట్లకు సంబంధించి 2,876 మందికి ఇచ్చిన రుణాల రికార్డులు లేవని కర్ణాటక కోర్టుకు సమాచారం ఇచ్చింది. బ్యాంకులో వేల కోట్ల రూపాయల అవినీతిపై ఈడీ విచారణ జరుపుతోంది. ఈమేరకు ఈడీ అధికారులు సిటీ సివిల్, సెషన్స్ కోర్టుకు సమాచారం అందించారు. ధరణి ఎంటర్‌ప్రైజెస్, లక్ష్మి రైస్ కార్నర్ యజమాని వీఆర్ రాజేశ్‌కు బెయిల్ పిటీషన్‌కు సంబంధించిన అభ్యంతరాల వేళ ఈ అంశం వెలుగులోకి వచ్చింది. రాజేశ్ 19వ ముద్దాయి కాగా 2023 ఫిబ్రవరి 21న అరెస్టు చేశారు. ఈడీ సమాచారం ప్రకారం వందల కోట్ల రూపాయల రుణం తీసుకున్న 24మంది ముఖ్యులలో రాజేశ్ కూడా ఒకరు. ఆయన భార్య పేరుతోనూ, భాగస్వాముల పేరుతోనూ రుణాలు తీసుకున్నారు. రాజేశ్ బెయిల్ కోసం దాఖలు చేసుకున్న పిటీషన్ విచారణ వేళ ఈడీ తరపు న్యాయవాదులు వందల కోట్లకు సంబంధించి రికార్డులు లేవని వివరించారు. నిందితుడు బయటకు వెళ్తే సాక్ష్యాలను నాశనం చేసే అవకాశం ఉందని వివరించారు. అయితే రాజేశ్ తరపు న్యాయవాదులు రూ.20కోట్ల రుణం తీసుకున్నారని రూ.18కోట్లు చెల్లించారని తెలిపారు. అయితే వందల కోట్ల రూపాయలు అక్రమాలకు సంబంధించి ఈడీ సమగ్ర దర్యాప్తు చేస్తోంది.

చిలకలనేర్పు డెయిరీ కాంగ్రెస్ కైవసం



నూతన డైరెక్టర్లకు సన్మానం

చేళూరు, ఫిబ్రవరి 18: తాలూకాలోని చిలకలనేర్పు పాల డైరీ కాంగ్రెస్ వశమైంది. 13 మంది డైరెక్టర్‌ల స్థానాలకు ఆదివారం ఎన్నికలు నిర్వహించగా అందరూ కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించారు. ఎన్నికల అధికారిగా పీ రమేశ్ వ్యవహరించగా, కార్యదర్శి వెంకటరెడ్డి పర్యవేక్షించారు. కాగా త్వరలోనే పాలడైరీ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటామని నూతన డైరెక్టర్‌లు తెలిపారు. డైరెక్టర్‌లను గ్రామస్థులు ఆత్మీయంగా సత్కరించారు.

సమాజ సేవకుడికి పురస్కారం



పురస్కారంతో సన్మానం

బొమ్మనహళ్ళి, ఫిబ్రవరి 18: జేపీ నగర్‌లోని కావ్యశ్రీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అవధూత గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహేంద్రనాథ్ శర్మకు బాలగంగాధరనాథ శతమానోత్సవ పురస్కారాన్ని ప్రదానంతో సత్కరించారు. ఆరేడేళ్లుగా సమాజ సేవా కార్యక్రమాల్లో రాణిస్తున్న కావ్యశ్రీ సేవా ట్రస్టు తరపున మహేంద్రనాథ్‌కు ప్రత్యేక పురస్కారం అందచేస్తున్నట్టు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. మహేంద్రనాథ్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ
కెనరాబ్యాంకు మేనేజర్ మృతి

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉడుపి జిల్లా కుందాపుర-బైందూరు జాతీయ రహదారిపై బైక్‌ను లారీ ఢీ కొన్న ప్రమాదంలో కెనరాబ్యాంకు మేనేజర్ దుర్మరణం చెందారు. మహారాష్ట్రకు చెందిన రాహుల్ బాలకృష్ణ రణకంబె మృతి చెందినవారిగా గుర్తించారు. శనివారం సాయంత్రం కుందాపుర బ్యాంకు శాఖలో విధులు ముగించుకుని బైందూరువైపు వెళ్తుండగా వెనుకనుంచి వచ్చిన లారీ ఢీ కొంది. తీవ్ర గాయాలపాలైన రాహుల్‌ను స్థానికులు కుందాపుర ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే అయన మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ తప్పించుకునే ప్రయత్నం చేయగా స్థానికులు పట్టుకున్నారు. గంగొళ్ళి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కాగా ప్రమాదంలో మృతి చెందిన బాలకృష్ణకు ఐదు నెలలక్రితం వివాహం జరిగినట్టు తెలుస్తోంది. ఇతడి అకస్మిక మృతితో వారి కుటుంబంలో విషాదం నెలకొంది.

రాజ్యాంగం ఒక వర్గానికి పరిమితం కాలేదు

బంగారపేట, ఫిబ్రవరి 18: రాజ్యాంగం ఏ ఒక వర్గం, కులానికి పరిమితం కాలేదని భారతీయులందరి సంక్షేమం కోసం ఉద్దేశించినదని సాంఘిక సంక్షేమశాఖ సహాయక డైరెక్టర్ శివారెడ్డి పేర్కొన్నారు. తాలూకాలోని కామసముద్ర, ఎళెసంద్ర, బూదికోటె, గొల్లహళ్ళి గ్రామాల్లో ఆదివారం ఏర్పాటైన రాజ్యాంగ జాగృతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు అవుతోందని, రామాయణ, మహాభారతం మాదిరిగానే దేశంలోని ప్రజలంతా రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్నారు. కోలారు, ముళబాగిలు, శ్రీనివాసపుర, మాలూరు, తాలూకాలలోని గ్రామాలలో ఇప్పటికే జాథా ముగిసి బంగారపేట తాలూకాలో కొనసాగుతోందని ఈనెల 25న బెంగళూరులో భారీ కార్యక్రమం ఏర్పాటు కానుందన్నారు. ప్రతి అధికారి సహా గ్రామ పంచాయతీ సభ్యుడైనా, అధ్యక్ష, ఉపాధ్యక్షులు, తాలూకా, జిల్లా పంచాయతీ, ఎమ్మెల్యే, ఎంపీలు కూడా రాజ్యాంగం ద్వారానే అధికారం పొందగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో కామసముద్ర గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఆదినారాయణకుట్టి, ఎళెసంద్ర గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సంగీత దేవరాజ్, బూదికోటె అధ్యక్షరాలు బీఆర్ మంజునాథ్, గొల్లహళ్ళి అధ్యక్షురాలు భవ్య సంతోష్, పీడీఓలు వాణి, ఆనంద, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ సహాయక డైరెక్టర్ శివారెడ్డి తదితరులు

ఆదర్శప్రాయుడు బసవణ్ణ



సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్, తహసీల్దార్ తదితరులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 18: సమాజం కోసం జీవితాన్ని అంకితం చేసిన బసవణ్ణ ఆదర్శప్రాయులని ఆయన బాటలో కొనసాగుతుండడంతోనే నేడు సంస్కృతి, సాహిత్యంలో రాష్ట్రం అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే రవికుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని మినీవిధానసౌధలో బసవణ్ణ జయంతిలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో జన్మించిన ఎంతోమంది మహిళలు తమ కుటుంబం కంటే సమాజహితం కోసం పాటుపడి ఆదర్శంగా నిలిచారన్నారు. సమాజంలోని మూఢ నమ్మకాలపై పోరాటం చేసి జాగృతి కల్పించిన బసవణ్ణ చూపిన మార్గం నేటికీ అనుసరణీయమన్నారు. 12వ శతాబ్దంలోనే ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం కలలు కని సమాజోద్ధరణకు పాటుపడ్డారన్నారు. వచనాల ద్వారా చైతన్యం కల్పించారన్నారు. ఈ సందర్భంగా బసవణ్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో తహసీల్దారు బీఎన్ స్వామి, కార్యనిర్వహణాధికారి మునిరాజు, నగరసభ కమిషనర్ మంజునాథ్, బీఈఓ నరేంద్రకుమార్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఎన్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కొళ్లేగాలలో నిరంతరం సమాజసేవ'

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా కొళ్లేగాల ప్రాంతంలో నిరంతరం సమాజసేవ కొనసాగిస్తామని పారిశ్రామికవేత్త సునితా తిమ్మేగౌడ ప్రకటించారు. తల్లి సావిత్రమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం అనాథాశ్రమంలో అన్నదానంతోపాటు వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునితా తిమ్మేగౌడ మాట్లాడుతూ రథసప్తమిని పురస్కరించుకుని కొళ్ళేగాల రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపించామన్నారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. కొళ్ళేగాల లక్ష్మీ నారాయణస్వామి ఆలయ అభివృద్ధి జీర్ణోద్ధరణ పనులు సాగుతున్నాయన్నారు. బెంగళూరు జేపీనగర్ వెంకటరమణస్వామి ఆలయ అభివృద్ధి, చిక్కపేటలోని రాఘవేంద్రస్వామి ఆలయ అభివృద్ధి చేశామన్నారు. ఆధ్యాత్మికంతోపాటు సమాజంలో అట్టడుగు వర్గాలకు తనవంతు సాయం అందిస్తానన్నారు.



కొళ్లేగాల విద్యార్థులతో సునితా తిమ్మేగౌడ

సాంకేతికతకు అనుగుణంగా రాణించాలి

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు రాణించాలని మసాయ్ స్కూల్ కో-ఫౌండర్ సీఈఓ ప్రతీక్ శుక్లా అభిప్రాయపడ్డారు. శనివారం మసాయ్ స్కూల్ శాఖలకు అనుబంధంగా 100వ బ్యాచ్ కాన్వొకేషన్ జరిగింది. 800మంది ఎడ్యుటెక్ ప్లాట్‌ఫాం ద్వారా పట్టాలు పొందారు. ప్రతీక్ శుక్లా మాట్లాడుతూ పరిశ్రమల రంగాలకు అవసరమైన మానవ వనరులను సమకూర్చేలా మసాయ్ శిక్షణలు ఇస్తోందన్నారు. ఇన్ఫోసిస్ డైరెక్టర్ శ్రీనాథ్ బట్ని మాట్లాడుతూ మసాయ్ స్కూల్స్ విద్యార్థులను ఆవిష్కరణ దిశగా తీసుకెళుతోందని ఇది సమాజానికి అవసరమైన విధానమన్నారు.



పట్టాలతో విద్యార్థుల బృందం

నేడు వేణుగోపాలస్వామి రథోత్సవం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 18: పట్టణంలోని పురాణ ప్రసిద్ధి చెందిన వేణుగోపాలస్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం జరగనుంది. ఈనెల 16నుంచి విశేషపూజలు కొనసాగుతున్నాయి. రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని తగిన చర్యలు చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవానికి ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్, తహసీల్దార్ బీఎన్ స్వామి, తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి మునిరాజు తదితరులు విచ్చేయనున్నారు.

సాహితీవేత్త విష్ణునాయక్ కన్నుమూత



విష్ణునాయక్ (ఫైల్)

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీ వేత్త, సంపాదకుడు, కళాకారుడైన విష్ణునాయక్ (81) కన్నుమూశారు. వయోభార సమస్యలతో అనారోగ్యంగా ఉన్న ఆయన చికిత్సలు ఫలించక ఆదివారం తుదిశ్వాస వీడారు. ఉత్తరకన్నడ జిల్లా అంకోలా తాలూకా అంబారకుడ్లిలో జన్మించిన ఆయన మైసూరు యూనివర్సిటీ నుంచి జానపద సాహిత్యంలో డిగ్రీ చేశారు. రాఘవేంద్ర పబ్లిషర్స్ యజమానిగా ఉన్న ఆయన వాస్తవ, నన్న అంబార కొడలు, మరిగుబ్బి, నోవు ప్రీతియ ప్రశ్నెతోపాటు పలు రచనలు చేశారు. యుద్ధనాటికను రచించారు. కేహెచ్ పాటిల్ సంపాదకత్వంలోని విశాల కర్ణాటక పత్రికకు కాలమిస్ట్‌గా వ్యవహరించారు. కర్ణాటక రాజ్యోత్సవ, సాహిత్య అకాడమీ, ఉత్తమ ఉపాధ్యాయుడితోపాటు పలు గౌరవాలు అందుకున్నారు. ఆయనకు ఇరువురు కుమార్తెలు, పెద్దసంఖ్యలో బంధువులు ఉన్నారు. ఎమ్మెల్యే సతీశ్‌సైల్ సహా సాహిత్యవేత్తలు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

మార్కెట్ ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో తొలగింపు ఇలా...

చింతామణి, ఫిబ్రవరి 18: పట్టణంలోని నగరసభ పరిధిలోని ఐడీఎస్‌ఎంటీ మార్కెట్ ఫుట్‌పాత్‌ను ఆక్రమించి పలు చిన్న బంకులు ఏర్పాటు చేసుకుని పూలు, పండ్లు ఇతరత్రా విక్రయించేవారు. దీంతో మార్కెట్‌కు వచ్చే ప్రజల సంచారానికి ఇబ్బందిగా ఉండేది. 1993-94లో జపాన్ తరహాలో పట్టణంలో 194 వాణిజ్య దుకాణాలతోకూడిన సముదాయాన్ని అప్పటి నగరాభివృద్ధి మంత్రి చౌడరెడ్డి చొరవతో కేఎస్‌ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పాత సంత మైదానం వద్ద చేపట్టారు. సుదీర్ఘ కాలంపాటు నిర్మాణాలు సాగి అందుబాటులోకి వచ్చింది. అయితే తగిన పర్యవేక్షణ లేకపోవడంతో సుమారు పదేళ్లుగా మార్కెట్ ఫుట్‌పాత్‌ను ఆక్రమించి దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇందుకు సంబంధించి పలు ఫిర్యాదులు రావడంతో నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి ఆదివారం ప్రత్యేక కార్యాచరణ నిర్వహించి ఆక్రమణలు తొలగించారు. నగరసభకు ఎటువంటి పన్ను చెల్లించకుండా నిర్వహిస్తున్న దుకాణాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలుత ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలలోని వస్తువులు తీయించారు. అనంతరం పొక్లైనర్ సాయంతో బంకులను తొలగించారు. కాగా పట్టణంలోని ప్రభుత్వ స్థలంలోనూ, ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన దుకాణాలను తొలగిస్తామని ఇందుకు అయ్యే నష్టానికి వ్యాపారులదే బాధ్యత అవుతుందన్నారు. ట్రాఫిక్ సజావుకోసం అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.